TGTEL/25/A4812

# వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 45 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ మంగళవారం | మే 26, 2026



## చాపకింద నీరులా ఎబోలా వ్యాప్తి

- ప్రపంచదేశాలకు కొత్త తలనొప్పి!
- మూడు వారాల్లోనే 3 దేశాలకు పాకిన బుండిబుగ్యో వేరియంట్
- కాంగోలో 204 మరణాలు..
- భారత్‌లో హై అలర్ట్
- 'ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్' వాయిదా

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రపంచాన్ని మరోమారు మహమ్మారి భయాలు వణికిస్తున్నాయి. కరోనా అంత వేగంగా కాకపోయినా.. 'బుండిబుగ్యో' అనే కొత్త రకం ఎబోలా వైరస్ ప్రస్తుతం చాపకింద నీరులా విస్తరిస్తూ అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తోంది. కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాలకు పాకిన ఈ వైరస్ వందలాది మందిని పడగొట్టింది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) దీనిని 'అంతర్జాతీయ స్థాయి ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ'గా ప్రకటించింది.ఈశాన్య కాంగోలోని యుద్ధ ప్రభావిత ప్రాంతమైన ఉగాండా సరిహద్దుల్లో ఈ వైరస్ తొలిసారి బయటపడింది. అక్కడ ఒక హెల్త్ వర్కర్ వాంతులు, జ్వరంతో చికిత్స పొందుతూ మరణించారు. ఆ తర్వాత అంత్యక్రియల్లో పాల్గొని, మృతదేహాన్ని తాకిన చాలా మందికి ఈ లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన వారికి కొన్ని వారాల పాటు లక్షణాలు బయటపడకపోవడమే ఈ వేగవంతమైన వ్యాప్తికి కారణమవుతోంది. స్థానిక ల్యాబ్‌లలో పరీక్షా సౌకర్యాలు లేకపోవడంతో, నమూనాలను వేల మైళ్ల దూరంలోని ప్రభుత్వ పరిశోధనా ల్యాబ్‌కు పంపాల్సి రావడం వల్ల వైరస్ గుర్తింపు ఆలస్యమైందని నిపుణులు చెబుతున్నారు. (మిగతా వివరాలు 2వ పేజీలో..)

## ఎండల తీవ్రత మరింత పెరుగుదల

### రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నట్టు వాతావరణశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఎండల తీవ్రత మరింతగా కొనసాగనుంది. వరుసగా రోహిణి రెండోరోజు కూడా ఎండలు మండుతున్నాయి. నిజానికి రుతుపవనాలు ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ వాతావరణ మార్పులతో, జూన్ 5నుంచి 10 వరకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నదని తెలిపింది. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నట్టు హెచ్చరించింది.

( మిగతా విరాలు 2 వ పేజీలో..)

## గవర్నర్‌ను కలిసిన కవిత

- వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని వినతి
- భూ నిర్వాసితులతో కలిసి లోక్‌భవన్‌కు వెళ్లిన కవిత



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వంద భారత్ :** వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కారణంగా భూములు, ఇళ్లు కోల్పోయి నష్టపోయిన నిర్వాసితులకు తక్షణమే న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో ఆమె బాధితులతో కలిసి గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నిర్వాసితులు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలపై గవర్నర్‌కు సమగ్రమైన వినతిపత్రాన్ని అందజేశారు.గవర్నర్‌తో భేటీ అనంతరం కవిత విలేకరులతో మాట్లాడారు. ఖమ్మం, వికారాబాద్ జిల్లాలతో పాటు ట్రిపుల్ ఆర్ పరిధిలోని బాధితుల గళాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని ఆమె పేర్కొన్నారు. వెలుగుమట్ల బాధితులకు ఇళ్ల స్థలాలు: ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్లు కోల్పోయి రోడ్డున పడ్డ బాధితులందరికీ ప్రభుత్వం తక్షణమే ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలాలు కేటాయించి ఆదుకోవాలి. వికారాబాద్ జిల్లా కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు పేరిట రైతులకు జారీ చేసిన భూసేకరణ నోటీసులను వెంటనే రద్దు చేయాలి. రీజినల్ రింగ్ రోడ్ బాధితుల సమస్యలను పరిష్కరిస్తూ, వారి భూములకు నష్టం వాటిల్లకుండా అలైన్‌మెంట్‌లో అవసరమైన మార్పులు చేయాలి. "వివిధ ప్రాజెక్టుల పేరుతో పేదలు, రైతుల పొట్టగొట్టడం సరికాదు. బాధితుల పక్షాన నిలబడి గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చాం. ఒకవేళ ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు న్యాయం చేయకపోతే.. బాధితులందరినీ ఏకం చేసి మళ్లీ పెద్ద ఎత్తున పోరాట బాట పడతాం" అని టీఆర్ఎస్ అధినేత కవిత స్పష్టం చేశారు.

## మహిళల భద్రత, గౌరవానికే తొలి ప్రాధాన్యం

- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- సంపద సృష్టించే శక్తిగా మహిళలకు ప్రోత్సాహం
- సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించిన సీతక్క



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. "మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి" అని ఆమె వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన 'సఖి నివాస్' వర్కింగ్ ఉమెన్ హాస్టల్ను మంత్రి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను సంపద సృష్టించే శక్తులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పరిమితిని పెంచుతున్నట్లు ప్రకటించారు. ఉద్యోగాల కోసం నగరానికి వచ్చే గ్రామీణ మహిళలకు హైదరాబాద్‌లో సురక్షితమైన వసతి కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. హాస్టల్‌లో ప్రస్తుతానికి 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. చిన్నపిల్లలతో వచ్చే వర్కింగ్ ఉమెన్స్ కోసం ఇక్కడ ప్రత్యేక వసతులను ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. మహిళా సాధికారతలో భాగంగా జూన్ 5వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహిళలకు ఆర్టీసీ బస్సులను అందజేయనున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. అలాగే, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిచే సోలార్ ప్లాంట్లను బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఖమ్మం జిల్లా మధిరలో ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పెద్ద ఎత్తున పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నది సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని మంత్రి గుర్తుచేశారు. మహిళలను కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను త్వరలోనే ఏర్పాటు చేయబోతున్నట్లు ఆమె ప్రకటించారు. మహిళా సంఘాలు మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు వంటి పెద్ద ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు. మహిళల ఆదాయం పెరిగితేనే కుటుంబాలు, తద్వారా రాష్ట్రం బలపడుతుందని ఆమె ఈ సందర్భంగా అశాభావం వ్యక్తం చేశారు.

## మజ్లిస్ ఒత్తిడితోనే జీహెచ్ఎంసీ విభజన

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- నగరంలో మంచినీటి సమస్యను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- 'ఇందిరమ్మ ఇళ్లు' పేరుతో కాంగ్రెస్.. 'డబుల్ బెడ్‌రూమ్' పేరిట బీఆర్ఎస్ పేదలను మోసం చేశాయి

2లో..



వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
మంగళవారం, మే 26, 2026

## మజ్లిస్ ఒత్తిడితోనే జీహెచ్ఎంసీ విభజన

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- నగరంలో మంచినీటి సమస్యను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- 'ఇందిరమ్మ ఇళ్లు' పేరుతో కాంగ్రెస్..
- 'డబుల్ బెడ్‌రూమ్' పేరిట బీఆర్ఎస్ పేదలను మోసం చేశాయి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మజ్లిస్ (ఏఐఎంఐఎం) పార్టీ ఒత్తిడికి తలొగ్గి, రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేసిందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తీవ్రంగా దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో కొత్త డివిజన్ల ఏర్పాటుపై ఇప్పటికీ ఇటు ప్రభుత్వానికి, అటు అధికారులకు ఎలాంటి స్పష్టత లేదని ఆయన విమర్శించారు. మంగళవారం కూకట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని పేద ప్రజలను కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి దారుణంగా అన్యాయం చేస్తున్నాయని రామచందర్‌రావు మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల' పేరుతో కాలయాపన చేసి మోసం చేస్తే.. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ 'ఇందిరమ్మ ఇళ్ల' పేరుతో ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తూ నమ్మకద్రోహానికి పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ పేరుతో కొందరు నేతలు జేబులు నింపుకున్నారని ఆరోపించారు. అదే సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నగరంలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుదేలైందని విమర్శించారు. "హైదరాబాద్ నగర ప్రజలు తీవ్రమైన మంచినీటి సమస్యతో అల్లాడుతుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. ప్రజాసమస్యలను పక్కదారి పట్టించడంలో కాంగ్రెస్ నేతలు బిజీగా ఉన్నారు. కాంగ్రెస్‌కు మజ్లిస్ పార్టీ ప్రసన్నం ముఖ్యం కానీ, భాగ్యనగర ప్రజల కష్టాలు ముఖ్యం కాదు" అని రామచందర్‌రావు ధ్వజమెత్తారు. భాగ్యనగరంలో కాలుష్య నియంత్రణను గాలికొదిలేశారని, కనీసం నగర మౌలిక వసతులను కూడా పట్టించుకోవడం లేదని రామచందర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని నిజమైన 'విశ్వనగరం'గా మార్చే దమ్ము, విజన్ బీజేపీకే ఉన్నాయని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్ కూటమికి ఓటు ద్వారా బుద్ధి చెప్పి, బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించాలని రామచందర్‌రావు పిలుపునిచ్చారు.

# చాపకింద నీరులా ఎబోలా వ్యాప్తి

- ప్రపంచదేశాలకు కొత్త తలనొప్పి!
- మూడు వారాల్లోనే 3 దేశాలకు పాకిన బుండిబుగ్యో వేరియంట్
- కాంగోలో 204 మరణాలు..
- భారత్‌లో హై అలర్ట్
- 'ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్' వాయిదా

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రపంచాన్ని మరోమారు మహమ్మారి భయాలు వణికిస్తున్నాయి. కరోనా అంత వేగంగా కాకపోయినా.. 'బుండిబుగ్యో' అనే కొత్త రకం ఎబోలా వైరస్ ప్రస్తుతం చాపకింద నీరులా విస్తరిస్తూ అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తోంది. కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాలకు పాకిన ఈ వైరస్ వందలాది మందిని పడగొట్టింది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) దీనిని 'అంతర్జాతీయ స్థాయి ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ'గా ప్రకటించింది.ఈశాన్య కాంగోలోని యుద్ధ ప్రభావిత ప్రాంతమైన ఉగాండా సరిహద్దుల్లో ఈ వైరస్ తొలిసారి బయటపడింది. అక్కడ ఒక హెల్త్ వర్కర్ వాంతులు, జ్వరంతో చికిత్స పొందుతూ మరణించారు. ఆ తర్వాత అంత్యక్రియల్లో పాల్గొని, మృతదేహాన్ని తాకిన చాలా మందికి ఈ లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన వారికి కొన్ని వారాల పాటు లక్షణాలు బయటపడకపోవడమే ఈ వేగవంతమైన వ్యాప్తికి కారణమవుతోంది. స్థానిక ల్యాబ్‌లలో పరీక్షా సౌకర్యాలు లేకపోవడంతో, నమూనాలను వేల మైళ్ల దూరంలోని ప్రభుత్వ పరిశోధనా ల్యాబ్‌కు పంపాల్సి రావడం వల్ల వైరస్ గుర్తింపు ఆలస్యమైందని నిపుణులు చెబుతున్నారు.

### వ్యాక్సిన్ లేకపోవడమే పెద్ద మైనస్..

గతంలో 2014లో పశ్చిమాఫ్రికాలో 11,300 మంది ప్రాణాలు తీసిన 'జైర్' వేరియంట్‌తో పోలిస్తే, ప్రస్తుత 'బుండిబుగ్యో' వేరియంట్ కొంచెం నెమ్మదిగానే వ్యాప్తి చెందుతుంది. ఈ వేరియంట్ సోకిన వారిలో మరణాల రేటు కూడా తక్కువగానే (సుమారు 30 శాతం) ఉంది. అయితే, దీనికి ఇప్పటివరకు ఎలాంటి నిర్దిష్ట వ్యాక్సిన్ గానీ, చికిత్స గానీ అందుబాటులో లేకపోవడం ఇప్పుడు వైద్య రంగాన్ని కలవరపెడుతోంది. ప్రస్తుతం కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఈ వ్యాప్తి తీవ్రంగా ఉంది. ఇప్పటివరకు కాంగోలో మొత్తం 867 కేసులు నమోదు కాగా, 204 మంది మృతి చెందారు.

### ప్రధాన మైనింగ్ కేంద్రంలో వ్యాప్తి..

ప్రస్తుతం వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న కాంగోలోని 'ఇటూరి' ప్రావిన్స్ ప్రధాన మైనింగ్ కేంద్రం కావడం, అక్కడ జనాభా రద్దీ విపరీతంగా ఉండటంతో వైరస్ కట్టడి ఆరోగ్య అధికారులకు పెద్ద సవాలుగా మారింది. గతంలో 2018లో ఇక్కడ ఎబోలా వ్యాపించినప్పుడు దానిని అదుపు చేయడానికి రెండేళ్ల సమయం పట్టింది.

### భారత్‌పై ఎబోలా ఎఫెక్ట్..

ఎబోలా ముప్పు దేశ రాజధానిపై కూడా పడింది. ఈ నెల 28 నుంచి 31 వరకు న్యూఢిల్లీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన '4వ ఇండియా–ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్'ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఆఫ్రికా దేశాల్లో నెలకొన్న అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ క్లిష్ట సమయంలో ఆఫ్రికా



దేశాలకు భారత్ సంపూర్ణ సంఘీభావం ప్రకటించడమే కాకుండా.. 'ఆఫ్రికా సీడీసీ'కి అవసరమైన సాంకేతిక, వైద్య సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది.

### విమానాశ్రయాల్లో ప్రత్యేక నిఘా..

దేశవ్యాప్తంగా కేంద్ర ఆరోగ్య శాఖ ముందస్తు జాగ్రత్తగా హై అలర్ట్ ప్రకటించింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణించవద్దని కేంద్రం హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుండి లేదా ఆయా దేశాల మీదుగా భారత్‌కు వచ్చే ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే ఎయిర్‌పోర్ట్ ఆరోగ్య అధికారులకు తమ ఆరోగ్య పరిస్థితిని నివేదించాలి.

ఎబోలా లక్షణాలు ఉన్నా లేదా బాధితులతో పరిచయం ఉన్నా ప్రయాణికులు స్వచ్ఛందంగా విమానాశ్రయ అధికారులకు తెలపాల్సి ఉంటుంది. "ప్రస్తుతానికి భారతదేశంలో ఎక్కడా ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదు. డబ్ల్యూహెచ్ఓ సూచనల ప్రకారం ప్రభుత్వం అన్ని ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటోంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రజలు ఆందోళన చెందవద్దు, కేవలం అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మండి" అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ఎండల తీవ్రత మరింత పెరుగుదల

## రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు

(మొదటి పేజీ తరువాత..) 20 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధికంగా 46.5 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా దండేపల్లిలో 46.4, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 46.4, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3, ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లో 46.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది. రాష్ట్రంలో మరో నాలుగురోజులపాటు తీవ్రమైన ఎండలు, వడగాలులు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసినట్టు తెలిపింది.రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే ఆదివారం ఒక్కరోజే దాదాపు 42మంది మృతి చెందారు. ఒక్క వరంగల్‌లోనే అత్యధికంగా 20మంది మృతి చెందగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10మంది, కరీంనగర్‌లో 8 మంది, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాతపడ్డారు. రాబోయే రోజుల్లో కూడా 43 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు హెచ్చరించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టగా, సాయంత్రం మాత్రం అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిశాయని వివరించింది. ముఖ్యంగా నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినట్టు తెలిపింది. కామారెడ్డి, మెదక్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వాన కురువగా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురిసినట్టు పేర్కొన్నది.

# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

## ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అమెరికా`ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టార్గెట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

# కాళేశ్వర ముక్తేశ్వరుని సన్నిధిలో హంపి పీఠాధిపతి

- సరస్వతి నదిలో పుణ్యస్నానం..
- స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు

**మహాదేవపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సరస్వతి అంత్య పుష్కరాల ముగింపు పర్వాన్ని పురస్కరించుకొని హంపి జగద్గురు పీఠానికి చెందిన శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరాన్ని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం త్రివేణి సంగమ తీరంలోని సరస్వతి నదిలో మహాస్వామి పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకున్న పీఠాధిపతికి అడిషనల్ కమిషనర్ ఎం.కృష్ణవేణి, ఆర్జేసీ రామకృష్ణారావుల ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వాగత సత్కారాల అనంతరం మహాస్వామి ఆలయ గర్భాలయంలోని కాళేశ్వర ముక్తేశ్వర స్వామివార్లకు జరిగిన ప్రత్యేక అభిషేక పూజల్లో పాల్గొని దర్శనం చేసుకున్నారు. తదనంతరం క్షేత్ర పాలకులుగా వెలుగొందుతున్న మహా సరస్వతి అమ్మవారిని, శ్రీ పార్వతి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ ఆశీర్వచన మండపంలో భక్తులకు మహాస్వామి అనుగ్రహ భాషణ చేసి, ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సాంప్రదాయం ప్రకారం ఈవో మహేష్, ధర్మకర్తలు, వేద పండితులు మహాస్వామికి శేష వస్త్రాలను, తీర్థప్రసాదాలను సమర్పించి సత్కరించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్థానిక వేద పండితులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వేడెక్కిన బల్మూర్ రాజకీయం

- నేడు 'గట్టుతుమ్మెన్'కు మర్రి జనార్దన్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్!
- బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ అక్రమ కేసులు, వేధింపులకు నిరసనగా గులాబీ అధిష్ఠానం యాక్షన్ ప్లాన్
- బాధిత కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచేందుకు రానున్న రాష్ట్ర స్థాయి ముఖ్య నేతలు
- భారీగా తరలిరావాలని బల్మూర్ మండల బీఆర్ఎస్ కమిటీ పిలుపు






**బల్మూర్/అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలం పరిధిలోని గట్టుతుమ్మెన్ గ్రామంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా తీవ్ర ఉత్కంఠగా మారింది. గ్రామంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు, కార్యకర్తలపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారని, అక్రమ కేసులు బనాయిస్తున్నారనే అంశంపై బీఆర్ఎస్ అధిష్ఠానం సీరియస్‌గా స్పందించింది. క్షేత్రస్థాయిలో నలిగిపోతున్న బాధిత కార్యకర్తలకు ధైర్యం చెప్పి, పార్టీ పరంగా కొండంత అండగా నిలబడేందుకు బీఆర్ఎస్ రాష్ట్ర స్థాయి ముఖ్య నేతలు నేడు గట్టుతుమ్మెన్ గ్రామానికి తరలివస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం.. బుధవారం సాయంత్రం 04:00 గంటలకు నాగర్‌కర్నూలు మాజీ ఎమ్మెల్యే, అచ్చంపేట నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త మర్రి జనార్దన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సంయుక్తంగా గట్టుతుమ్మెన్ గ్రామంలో పర్యటించనున్నారు. వీరితో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోకల మనోహర్, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నేతలు ఈ పర్యటనలో పాల్గొననున్నారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్య నేతలు గ్రామంలో అక్రమ కేసులకు గురై ఇబ్బందులు పడుతున్న పార్టీ కార్యకర్తలను, వారి కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా కలిసి పరామర్శించనున్నారు. అధికార పార్టీ వేధింపులను తిప్పికొట్టేలా, భవిష్యత్తులో చేపట్టబోయే చట్టపరమైన, రాజకీయ పోరాటాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. గులాబీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది.అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ పర్యటనను వంద శాతం విజయవంతం చేయాలని బల్మూర్ మండల బీఆర్ఎస్ పార్టీ కమిటీ పిలుపునిచ్చింది. అచ్చంపేట నియోజకవర్గంలోని, ముఖ్యంగా బల్మూర్ మండల పరిధిలో ఉన్న పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సైనికులు, అభిమానులు అందరూ గట్టుతుమ్మెన్ గ్రామానికి తరలిరావాలని పార్టీ శ్రేణులు కోరాయి. ముఖ్య నేతల రాకతో అచ్చంపేట నియోజకవర్గంలో రాజకీయం మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

## తహసీల్దార్ వెంకటేష్



**లింగాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** చిన్నారుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, వీటిని పూర్తిగా అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని లింగాల తహసీల్దార్ వెంకటేష్ పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం లింగాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో 'బాల్య వివాహాల నిర్మూలన'పై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీమతి పూజారి ఈశ్వరమ్మ బుద్ధయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ.. చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల బాలికలు శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ స్థాయిలో ప్రజల్లో విస్తృతంగా అవగాహన పెంపొందించి, బాల్య వివాహాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను, గ్రామ పెద్దలను ఆదేశించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. గ్రామ సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. గ్రామాన్ని బాల్య వివాహాలు లేని పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గిరిజ, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి ప్రమీల, 8వ వార్డు సభ్యులు సర్రాం రాజు, వీఓ అధ్యక్షురాలు పోల మంగమ్మ, మహిళా నాయకురాలు ఇందిరమ్మతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల నివారణే ధ్యేయం

- 13వ వార్డులో ముమ్మరంగా లైన్ల మరమ్మతులు
- వర్షాకాలం ముందస్తు చర్యలు
- స్తంభాల సరిచేత, వదులుగా ఉన్న వైర్ల పునరుద్ధరణ
- ఫోన్ కాల్‌కే స్పందిస్తున్న లైన్‌మెన్ శేఖర్ గౌడ్



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో ఎలాంటి విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ ముందస్తు ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా పట్టణంలోని 13వ వార్డు పరిధిలోని వలపట్ల శ్రీరామ నగర్ కాలనీలలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. వర్షాకాలంలో వచ్చే ఈదురుగాలులు, భారీ వర్షాల వల్ల లైన్లు తెగిపడటం, స్తంభాలు వంగిపోవడం వంటి సమస్యలు రాకుండా లైన్‌మెన్ శేఖర్ గౌడ్ తన సిబ్బందితో కలిసి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. కాలనీల్లో నాణ్యత లేని, వదులుగా వేలాడుతున్న పాత విద్యుత్ వైర్లను గుర్తించి వాటి స్థానంలో కొత్త వైర్లను అమరుస్తున్నారు. అలాగే ప్రమాదకరంగా ఒరిగిన విద్యుత్ స్తంభాలను గుర్తించి, వాటిని నిటారుగా నిలబెడుతూ మరమ్మతులు జరుపుతున్నారు. వినియోగదారులకు వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కరెంట్ కోతలు లేకుండా చూసేందుకు తమ సిబ్బంది అనునిత్యం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటారని లైన్‌మెన్ శేఖర్ గౌడ్ తెలిపారు. కాలనీవాసులకు విద్యుత్ సరఫరాలో ఏ చిన్న సమస్య వచ్చినా.. కేవలం ఒక ఫోన్ కాల్ చేయగానే లైన్‌మెన్ శేఖర్ గౌడ్ తక్షణమే స్పందించి, ఘటనా స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తున్నారు. వినియోగదారుల పట్ల ఆయన చూపిస్తున్న నిబద్ధత, అందిస్తున్న వేగవంతమైన సేవలకు గానూ కాలనీ ప్రజల నుండి విశేష గుర్తింపు, ప్రశంసలు లభిస్తున్నాయి. రాబోయే వర్షాకాలం అంతా ఇదే రీతిన అప్రమత్తంగా ఉండి సేవలు అందిస్తామని, ప్రజలు ఎవరూ విద్యుత్ లైన్ల విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని, ఏ సమస్య ఉన్నా తమకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా లైన్‌మెన్ కోరారు.

# అక్రమ వడ్డీ దందాలపై పోలీసుల ఉక్కుపాదం

- రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా దాడులు
- 15 ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు..
- ఆరు కేసులు నమోదు
- అధిక వడ్డీలతో వేధిస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హెచ్చరిక



**రాజన్న సిరిసిల్ల జిల్లా, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఫైనాన్స్, వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపింది. అక్రమ ఫైనాన్స్, మీటర్ వడ్డీ దందాలే లక్ష్యంగా మంగళవారం ఉదయం జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీలకు సంబంధించిన వివరాలను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. తే ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేని అక్రమ వడ్డీ వ్యాపారుల గుట్టు రట్టు చేసేందుకు 15 ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. నమ్మదగిన సమాచారంతో పలు ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారుల ఇళ్లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 06 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. బాధితుల నుంచి అక్రమంగా వసూలు చేసిన రూ.1,39,65,000/- విలువ గల వివిధ రకాల ప్రామిసరీ నోట్లు, చెక్కులు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, అలాగే రూ.1,77,000/- విలువ గల బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. ప్రజల ఆర్థిక అవసరాలను, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొందరు అక్రమంగా వడ్డీ వ్యాపారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సామాన్య ప్రజల నుండి ముక్కుపిండి అధిక వడ్డీలు వసూలు చేస్తూ, దౌర్జన్యాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాత్కాలిక అవసరాల కోసం అవసరానికి మించి అధిక వడ్డీలకు అప్పులు చేసి, ఆ తర్వాత వాటిని తీర్చలేక ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకుని కుటుంబాలను రోడ్డున పడేయవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ అనుమతి పొంది, చట్టబద్ధమైన పద్ధతులలో నడిచే ఫైనాన్స్ సంస్థలను మాత్రమే ప్రజలు ఆశ్రయించాలని ఎస్పీ సూచించారు. మీ పరిసరాల్లో ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ ఫైనాన్స్ వ్యాపారం నడిపినా, అధిక వడ్డీల కోసం వేధించినా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో తనకు సమాచారం అందించవచ్చని లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు.

# నూతన ఎస్సై మహేష్‌కు సన్మానం




**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఉప్పునుంతల మండల నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు స్వీకరించిన మహేష్‌ను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మహేష్‌కు వారు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతల నాగరాజు మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాన్య, పేద ప్రజలకు నూతన ఎస్సై ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ న్యాయం చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖకు తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. తమను కలిసి సన్మానించిన సంఘం నాయకులకు ఎస్సై మహేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, మాజీ సర్పంచ్ కొట్టే తిరుపతయ్య యాదవ్, మత్స్య కార్మిక సంఘం మండల నాయకులు భీమయ్య, నవతెలంగాణ విలేఖరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
మంగళవారం, మే 26, 2026

# వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మ సిద్ధోత్సవం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ పరిధిలోని తిప్పాపురంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి సిద్ధోగ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, నయనానందకరంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ప్రభుత్వ విప్‌కు గౌడ సంఘం నాయకులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆది శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు మరియు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేములవాడ ప్రజలందరిపై ఆ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఉత్సవాలను ఇంత ఘనంగా నిర్వహించిన గౌడ కులబంధువులను ఆయన అభినందించారు. ఈ వేడుకలో ప్రభుత్వ విప్‌తో పాటు వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం నాయకులు, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ దుర్గం పరశురాములు గౌడ్, నాగుల సంపత్ గౌడ్, ఆలయ కమిటీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# భారీ గాలివాన బీభత్సం

**చిట్యాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మంగళవారం సాయంత్రం చిట్యాల మండల పరిసర ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి తీవ్రమైన ఈదురుగాలులతో కూడిన భారీ గాలివాన బీభత్సం సృష్టించింది. ఈ అకస్మాత్తు ప్రకృతి విపత్తు కారణంగా చిట్యాల పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న భారీ వృక్షాలు ఒక్కసారిగా వేర్లతో సహా కుప్పకూలిపడ్డాయి. ఈ ఈదురుగాలుల ధాటికి స్టేషన్ పరిసరాల్లో ఉన్న రెండు విద్యుత్ స్తంభాలు కూడా విరిగిపడ్డాయి. దీంతో పాటు స్టేషన్ ఆవరణలో పెద్ద చెట్టు కూలిపోవడంతో అక్కడ పార్క్ చేసి ఉన్న పోలీస్ సిబ్బందికి చెందిన కారుపై భారీ కొమ్మలు పడి, కారు వెనుక భాగం, అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కరెంట్ స్తంభాలు విరిగిపడటం, వైర్లు తెగిపోవడంతో స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు, కమ్యూనికేషన్ వ్యవస్థకు పూర్తిగా అంతరాయం కలిగింది.

# పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- యుద్ధప్రాతిపదికన కాలువల పనులు..
- చివరి ఆయకట్టుకూ సాగునీరు అందిస్తాం
- బీఆర్ఎస్ నాయకులవి పచ్చి అబద్ధాలు..
- ఏ ముఖం పెట్టుకుని పాదయాత్రలు చేస్తారు?
- త్వరలోనే ఉమ్మడి పాలమూరు జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి..
- సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష



**నాగర్‌కర్నూల్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న వాదనలు పచ్చి అబద్ధాలని ఆయన ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లోని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రధాన భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్, పంప్ హౌస్, ప్యాకేజీ-3, ఏదుల పంప్ హౌస్, రిజర్వాయర్ మరియు కుమ్మెర వద్ద జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.



### బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల నిర్లక్ష్యం

గత ప్రభుత్వం కనీస పనులు చేపట్టకుండా, క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మంత్రి జూపల్లి మండిపడ్డారు. "రూ. 80 వేల కోట్ల అంచనాలతో ప్రారంభించి, రూ. 35 వేల కోట్లు మంజూరైనా.. పదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ. 27 వేల కోట్లే. కనీసం ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను కూడా నిర్మించకుండా అసంపూర్తిగా వదిలేశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల లబ్ధి కోసం ఆర్భాటంగా ఒక్క పంపును గంటపాటు నడిపించి ప్రాజెక్టు పూర్తయిందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. నార్లాపూర్ వద్ద బిగించాల్సిన 9 మోటర్లలో కేవలం మూడింటిని మాత్రమే ప్రస్తుత ప్రభుత్వం బిగించిందని, మరో ఐదు మోటర్లను తక్షణమే బిగించాల్సి ఉందన్నారు.

### 12 లక్షల ఎకరాలకు నీరందించడమే ధ్యేయం

ఈ ప్రాజెక్టు ద్వారా 90 టీఎంసీల నికర జలాలను వినియోగంలోకి తెచ్చి, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల పరిధిలోని 4.60 లక్షల ఎకరాలతో పాటు మొత్తం 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని మంత్రి చెప్పారు. నార్లాపూర్ నుంచి ఉద్దండాపూర్ వరకు ప్రధాన కాలువల పెండింగ్ పనులను, మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఆటంకాలు కలగకుండా పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.

### కల్వకుర్తి, జూరాల ప్రాజెక్టులపై విమర్శలు

మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పట్ల కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మంత్రి విమర్శించారు. 4.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందాలంటే కనీసం 25 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉండాలని, కానీ రిజర్వాయర్ల సామర్థ్యం కేవలం 4 టీఎంసీలే ఉంచడం వల్ల 40 వేల ఎకరాలకు మించి నీరందే పరిస్థితి లేదన్నారు. జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయిలాసాగర్ వంటి ప్రాజెక్టులకు సరైన నీటి నిల్వ సామర్థ్యం లేకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని, పాలమూరును విస్మరించి గత పాలకులు ఇతర ప్రాంతాలపైనే దృష్టి పెట్టారని ఆరోపించారు.

### త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి రంగంలో శాశ్వత పరిష్కారాలు చూపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చే వారంలో జిల్లాలో పర్యటించనున్నట్లు మంత్రి జూపల్లి వెల్లడించారు. సీఎం స్వయంగా ప్రాజెక్టుల పరిస్థితులను క్షేత్రస్థాయిలో సమీక్షించి, పనులను వేగవంతం చేసేందుకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. కల్వకుర్తి పథకం ద్వారా అచ్చంపేట, వనపర్తి, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లోని చివరి ఎకరా వరకు నీరందించేందుకు ఎల్లూరు, సింగోటం, గుడిపల్లి వరకు మట్టికట్టలను సరిచేసి, ప్యాకేజీ-3 పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు.

# సెక్రటేరియట్‌లో ఇరిగేషన్‌పై హైలెవల్ మీటింగ్

- మంత్రులు ఉత్తమ్, బోసురాజ్‌లతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**హైదరాబాద్/అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర సచివాలయం వేదికగా సాగునీరు, భూగర్భ జలాల లభ్యతపై అత్యంత కీలకమైన అంతరాష్ట్ర ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో కర్ణాటక రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఎన్.ఎస్. బోసురాజ్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొని, నల్లమల ప్రాంత నీటి అవసరాలను ఇరు రాష్ట్రాల మంత్రులు మరియు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంతరాష్ట్ర ఉన్నత స్థాయి సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులు, ప్రస్తుత ఎండకాలం నేపథ్యంలో భూగర్భ నీటిమట్టాల పరిస్థితి, తాగునీటి సరఫరా మరియు రానున్న వానాకాలం సీజన్‌కు గాను అనుసరించాల్సిన కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకల మధ్య ఇరిగేషన్ ప్రాజెక్టుల నీటి లభ్యత, జల వనరుల సమర్థవంతమైన నిర్వహణపై ఉమ్మడి వ్యూహాల గురించి ఇరు రాష్ట్రాల మంత్రులు సమీక్షించారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. నల్లమల పీఠభూమి పరిధిలోని అచ్చంపేట నియోజకవర్గంలో భూగర్భ జలాల పెంపునకు, పెండింగ్ సాగునీటి అవసరాలను తీర్చడానికి ప్రత్యేక కార్యాచరణ అవసరమని అధికారులకు సూచించారు. ప్రస్తుత వేసవి దృష్ట్యా నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రులను కోరారు. ఈ కీలక సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు శాసనసభ్యులతో పాటు, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఈఎన్‌సీలు , భూగర్భ జలాల శాఖ ఉన్నతాధికారులు,ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ విభాగ ప్రతినిధులు పాల్గొన్నారు.



# 'పూర్వ విద్యార్థుల' అపూర్వ సమ్మేళనం

- షాత్రాజుపల్లి పాఠశాలలో ఘనంగా ఆత్మీయ కలయిక

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కాలం పరుగులో ఎవరి దారిలో వారు బిజీగా మారిపోయినా.. బాల్యపు స్నేహం, చదువుకున్న బడి ఇచ్చిన జ్ఞాపకాలు వారిని మళ్లీ ఒకచోటికి చేర్చాయి. షాత్రాజుపల్లి ఉన్నత పాఠశాలలో 2003-2004 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సుదీర్ఘంగా 22 సంవత్సరాల తర్వాత నేడు పాఠశాల ప్రాంగణంలో ఘనంగా 'ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించారు. రెండు దశాబ్దాల తర్వాత చిన్ననాటి స్నేహితులంతా ఒకే వేదికపైకి చేరడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. ఒకరినొకరు కౌగిలించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. క్లాస్ రూమ్ ముచ్చట్లు, గతంలో గడిపిన ఆనందకరమైన మధుర క్షణాలను గుర్తుచేసుకుంటూ రోజంతా ఎంతో ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చిన్ననాటి ఆటలు, పాటలు, నృత్యాలతో అలరించారు. ఈ అపూర్వ సమ్మేళనంలో విద్యార్థులు తమకు క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మరువకుండా



గౌరవించుకున్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులతో పాటు విద్య నేర్పిన గురువులకు నిజమైన గుర్తింపు దక్కుతుందని ఈ సందర్భంగా విద్యార్థులు కొనియాడారు. అనంతరం తమ ప్రియతమ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికలను అందజేసి కృతజ్ఞతలు చాటుకున్నారు. తమ విద్యార్థులు సమాజంలో మంచి స్థానాల్లో స్థిరపడటం చూసి గురువులు సైతం ఉద్వేగానికి లోనయ్యారు. ఈ ఆత్మీయ కలయిక కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు శ్రీనివాస్, దయానంద్, వెంకటగిరి, రేగుల శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే పూర్వ విద్యార్థులు కమలాకర్, చందనం శ్రీనివాస్, శ్రావన్, కార్తీక్, నజీమా, లావణ్య, స్వప్న, నాగజ్యోతి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.